# భారతదేశ చరిత్ర

## మౌర్య సామ్రాజ్యం

క్రీ.పూ. 321లో చంద్రగుప్త మౌర్యుడు స్థాపించిన మౌర్య సామ్రాజ్యం అశోకుడి పాలనలో ఉన్నత దశకు చేరుకుంది. మౌర్యుల కాలంలో జైన, బౌద్ధ మతాలు ఎంతో ప్రాచుర్యం పొందాయి. అనేక శిలాశాసనాలు, స్తూపాలను నిర్మించారు. చరిత్రలో నిలిచిపోయిన కళింగ యుద్ధం వీరి కాలంలోనే జరిగింది. భారతదేశ చరిత్ర - సంస్కృతికి విశేష సేవలు అందించిన మౌర్యుల పాలన క్రీ.పూ. 184లో ముగిసింది.

### ఆధారాలు

మౌర్యుల చరిత్రకు అనేక పురావస్తు ఆధారాలతో పాటు సాహిత్య ఆధారాలు కూడా ఉన్నాయి. ముఖ్యంగా కౌటిల్యుడి అర్థశాస్త్రం మౌర్యుల పరిపాలనా అంశాలను వివరిస్తుంది. చంద్రగుప్త మౌర్యుడి ఆస్థానానికి వచ్చిన గ్రీకు రాయబారి మెగస్తనీస్ రాసిన 'ఇండికా' గ్రంథం మౌర్యుల కాలం నాటి సాంఘిక, ఆర్థిక అంశాలను వివరిస్తుంది. గుప్తుల కాలంలో విశాఖదత్తుడు రాసిన 'ముద్రారాక్షసం' గ్రంథం మౌర్యుల చరిత్రకు ఆధారం. వివిధ మత గ్రంథాలు కూడా మౌర్యుల చరిత్రను వివరిస్తున్నాయి. పురాణాలు, బౌద్ధ జాతక కథలు, దిఘనికాయ, వంశధపకాశిని, పరిశిష్టపర్వం లాంటి మత సాహిత్యం మౌర్యుల చరిత్రకు ఆధారాలు. వీటితో పాటు పురావస్తు ఆధారాలైన శాసనాలు, నాణేలు, కట్టడాలు, మృణ్మయ పాత్రలు మౌర్యుల చరిత్రను పునర్ నిర్మించడానికి తోడ్పడుతున్నాయి. అశోకుడి శాసనాలు భారతదేశంలో తొలి శాసనాలుగా పేరొందాయి.

## రాజకీయ చరిత్ర

### చంద్రగుప్త మౌర్యుడు (క్రీ.పూ.321-297)

మౌర్య వంశ స్థాపకుడు చంద్రగుప్త మౌర్యుడు. ఈయన మురా అనే స్త్రీకి జన్మించడం వల్ల వీరిని మౌర్యులుగా పిలుస్తారని చరిత్రకారుల అభిప్రాయం. బౌద్ధ సాహిత్యంలో మౌర్యులను క్షత్రియులుగా, మహావంశం అనే బౌద్ధ గ్రంథంలో చంద్రగుప్త మౌర్యుడిని క్షత్రియుడిగా పేర్కొన్నారు. 'దిఘనికాయ' బౌద్ధ గ్రంథం పిప్పిలి వనంలో మౌర్యులు అనే క్షత్రియ తెగ ఉండేదని తెలుపుతుంది. విశాఖదత్తుడి 'ముద్రారాక్షసం' గ్రంథంలో చంద్రగుప్త మౌర్యుడిని వృషాల/త్రిశాల (హీనకులజుడు) అని పేర్కొన్నారు. నందవంశ రాజులు కౌటిల్యుడిని అవమానించడంతో అతడు పాటలీపుత్రకు చెందిన చంద్రగుప్త మౌర్యుడి సహాయంతో నందవంశాన్ని నిర్మూలించాలని భావించాడు. కౌటిల్యుడిని చాణక్యుడు, విష్ణుగుప్తుడు అనే పేర్లతో ప్రస్తావించారు. కౌటిల్యుడి సహాయంతో చంద్రగుప్త మౌర్యుడు మొదట మగధపై దండెత్తి చివరి నందవంశ రాజు ధననందుడిని ఓడించి మౌర్య సామ్రాజ్యాన్ని స్థాపించాడు. తర్వాత గ్రీకు ప్రతినిధి అయిన సెల్యూకస్ నికేటర్‌ను ఓడించి వాయవ్య భారతదేశంపై అధికారం పొందాడు. ఓడిపోయిన సెల్యూకస్ నికేటర్ తన కుమార్తె హెలెన్‌ను చంద్రగుప్త మౌర్యుడికి ఇచ్చి వివాహం చేశాడు. చంద్రగుప్త మౌర్యుడు సెల్యూకస్ నికేటర్‌కు 500 ఏనుగులను బహుకరించాడు. సెల్యూకస్ నికేటర్ గ్రీకు రాయబారి మెగస్తనీస్‌ను చంద్రగుప్త మౌర్యుడి ఆస్థానానికి పంపాడు. క్రీ.పూ. 321 నుంచి 297 వరకు పాలించిన చంద్రగుప్త మౌర్యుడు తన చివరి పాలనా కాలంలో దిగంబర జైనమతాన్ని స్వీకరించి కర్ణాటకలోని శ్రావణబెల్గోళా వద్ద సల్లేఖనవ్రతం ఆచరించాడు. ఈయన కాలంలోనే ప్రస్తుత గుజరాత్‌లోని కథియవాడ్‌లో సుదర్శన తటాకాన్ని తవ్వించారు. జైనమత గ్రంథమైన పరిశిష్టపర్వం (హేమచంద్రుడు) ఆయన జైనమతం స్వీకరించినట్లు పేర్కొంటుంది. చంద్రగుప్త మౌర్యుడి జైనమత గురువు భద్రబాహుడు.

### బిందుసారుడు (క్రీ.పూ.297-273)

చంద్రగుప్త మౌర్యుడి అనంతరం అతడి కుమారుడు బిందుసారుడు రాజ్యపాలన చేశాడు. ఇతడిని గ్రీకు రచనలు 'అమిత్రో ఖేటస్'గా పేర్కొన్నాయి. బిందుసారుడు అమిత్రఘాత (శత్రు సంహారకుడు)గా పేరొందాడు. మౌర్య సామ్రాజ్యాన్ని దక్షిణాన మైసూర్ వరకు విస్తరింపజేశాడు. ఇతడి కాలంలో సిరియా రాజైన మొదటి ఆంటియోకస్ తన రాయబారిగా డైమాకస్‌ను పంపాడు. బిందుసారుడు అజీవక మత శాఖను ప్రోత్సహించి, ఆ మతానికి చెందిన పింగళివత్సలుడనే జ్యోతిష్కుడిని పోషించాడు. ఈయన కాలంలో తక్షశిలలో ప్రజా తిరుగుబాటు జరిగింది. దీన్ని యువరాజుగా ఉన్న అశోకుడు అణచివేశాడు.

## అశోకుడు (క్రీ.పూ.273-232)

**అ**శోకుడు బిందుసారుడి కుమారుడు, చంద్రగుప్త మౌర్యుడి మనుమడు. అతడి తల్లి సుభద్రాంగి. అశోకుడి భార్యల్లో అసంధిమిత్ర పట్టపురాణిగా ఉండేది. కుమార్తెలు సంఘమిత్ర, చారుమతి; కుమారులు మహేంద్రుడు, తివార, కుణాలుడు, జలౌకుడు. దేవానాంప్రియ, ప్రియదర్శి అశోకుడి బిరుదులు. తన తండ్రి మరణానంతరం క్రీ.పూ. 273లో పాలనకు వచ్చినప్పటికీ పట్టాభిషేకం క్రీ.పూ. 268లో జరిగింది. అశోకుడు తన తండ్రి పాలనాకాలంలో మొదట ఉజ్జయిని ప్రాంతానికి పాలకుడిగా (గవర్నర్) ఉన్నాడు. తర్వాత తక్షశిలలో ప్రజా తిరుగుబాటును అణచివేయడంతో అక్కడ గవర్నర్‌గా నియమించారు. 1915లో బయల్పడిన 'మస్కి' శాసనంలో అశోకుడి పేరును కనుక్కున్నారు. రాణ్యఅశోక అనే పేరును కనగనహళ్లి శాసనంలో ప్రస్తావించారు. ఇతడి శాసనాల్లో ఉపయోగించిన బ్రాహ్మీలిపికి జేమ్స్ ప్రిన్సిప్ అనే చరిత్రకారుడు అర్థాన్ని కనుక్కున్నాడు.

## కళింగ యుద్ధం (క్రీ.పూ.261)

దక్షిణాపథానికి వెళ్లే భూ, జల మార్గాలు కళింగ అధీనంలో ఉండటంతో అశోకుడు కళింగను జయించాలని యుద్ధం చేశాడు. నాటి కళింగ పాలకుడైన అనంత పద్మనాభుడు ఈ యుద్ధంలో ఓటమి పాలయ్యాడు. అశోకుడు లక్షలాదిమంది సైనికుల మరణాన్ని చూసి భవిష్యత్తులో ఇక యుద్ధం చేయకూడదని నిర్ణయం తీసుకున్నట్లు చరిత్రకారులు పేర్కొన్నారు. ఇతడి 13వ శిలాశాసనం (ధౌళి/జౌగాడ శాసనం) కళింగ యుద్ధం గురించి వివరిస్తుంది. ఈ శాసనంలో అశోకుడు తన 8వ పాలనా సంవత్సరంలో కళింగయుద్ధం చేసినట్లు ప్రస్తావించాడు.

**రచయిత: బొత్స నాగరాజు**